నయనానందం.. ఎదుర్కోలు సంబురం

సింహవాహన అలంకారంలో స్వామివారు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 9 : పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఎదుర్కోలు మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణం, నిశ్చయ తాంబూలాలకు ఒప్పందం కుదుర్చారు. సోమవారం రాత్రి సుమారు 9గంటలకు కల్యాణ సుముహూర్త ఘడియలుగా నిర్ణయించారు. నరసింహుడి వరపూజ, వధువు లక్ష్మీదేవికి పూలు, పండ్ల కార్యక్రమం కనుల పండువగా అర్చకులు నిర్వహించారు. రాత్రి 8గంటల సమయంలో పట్టువస్త్రాల అలంకరణలతో అశ్వవాహన సేవపై నారసింహస్వామి, ముత్యాల పల్లకీపై లక్ష్మీదేవి ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లారు. మేళతాళాల నడుమ ప్రధాన మండపానికి చేరారు. ఎదురెదురుగా స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి శ్రీవారి వైపు ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అమ్మవారి వైపు ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, అర్చక బృందం వైష్ణవ సంప్రదాయ రీతిలో కల్యాణ ఒప్పందాన్ని కుదుర్చారు.

పెళ్లి కుమారుడిగా నారసింహస్వామి

పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహుడు పెళ్లి కుమారుడయ్యాడు. ఉదయం పెళ్లికొడుకైన శ్రీవారిని సింహవాహన అలంకార సేవలో భక్తుల సందర్శనార్థం తిరువీధుల్లో ఊరేగించారు. పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన తిరుకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. పాతగుట్ట ఆలయ ప్రాంగణంలో గల కల్యాణ మండపాన్ని ముస్తాబు చేశారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు కూర్చునేందుకు సకల వసతులు కల్పించారు.

ఎమ్మెల్యే గారూ సాగు నీళ్లివ్వండి

- బీర్ల ఐలయ్యకు రైతు జేఏసీ నాయకుల వినతి


ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం ఇస్తున్న రైతు జేఏసీ నాయకులు

రాజాపేట, ఫిబ్రవరి 9 : కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపి సాగుజలాలు అందించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాజాపేటలో రైతు జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. సాగు జలాల కోసం మండల కేంద్రంలో రైతు జేఏసీ నాయకులు కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిరసన తెలుపుతున్న క్రమంలో అటువైపు నుంచి వెళ్తున్న ఎమ్మెల్యేను అపి సాగునీరు అందించి ఆదుకోవాలని విన్నవించారు. దానికి ఎమ్మెల్యే స్పందించి సాగు జలాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, సట్టు తిరమలేశ్, సందిల భాస్కర్‌గౌడ్, కాకల్ల ఉపేందర్, బెడిదె వీరేశం, కుమ్మరి లక్ష్మణ్, ఉప్పలయ్య గౌడ్, జెన్నె సిద్ధులు, వెంకటేశం, ఎల్లయ్య, శ్రీశైలం, సిద్ధులు, కిష్టయ్య, బాలరాజు, సీతయ్య, కొమురయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఉసిర్లె వర్రె వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సీపీఐ


గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : మండలంలోని బస్వాపురం గ్రామం నుంచి భువనగిరికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉసిర్లె వర్రె వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం బస్వాపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడుతూ బస్వాపురం గ్రామానికి సమీపంలో ఉన్న ఉసిర్లె వర్రె వాగుపై బ్రిడ్జిని సీపీఐ ఆధ్వర్యంలో 25సంవత్సరాల క్రితం పునర్నిర్మాణం చేపట్టారన్నారు. సంవత్సరం క్రితం బ్రిడ్జికి పెద్ద రంధ్రం పడినా పట్టించుకున్న నాథుడు లేడని పేర్కొన్నారు. పెద్ద వర్షం పడితే నీళ్లు పైకి వచ్చి ప్రయాణికులు, పొలాల దగ్గరికి వెళ్లే రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి భువనగిరికి వెళ్లే ప్రధాన రహదారి వాగుపై వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం కోసం సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉడత రాఘవులు, చిక్క భిక్షపతి, సత్యనారాయణ, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థి భరత్‌చంద్రకు అండగా ఉంటా

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సాగర్

భరత్‌చంద్రకు సైకిల్, ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సాగర్

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 9 : మండలంలోని శేరిగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి భరత్ చంద్రకు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు శివరాత్రి సాగర్ అన్నారు. భరత్‌చంద్ర కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలకు వెళ్లడానికి సైకిల్, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. భరత్‌చంద్ర కుటుంబానికి భవిష్యత్‌లో కూడా అన్ని విధాలుగా అండగా ఉంటానని ఈ సందర్భంగా సాగర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కడ్తాల కిషన్, నాయకులు గడ్డం మురళీధర్‌రెడ్డి, పాలెం వీరేశ్ గౌడ్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

'బీజేపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి'

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 9 : బీజేపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌల్ అన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సోమవారం నిర్వహించనున్న మహాధర్నా కరపత్రాలను మండలంలోని పటేల్‌గూడెంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య, విజయ, రమ్య పాల్గొన్నారు.

సూర్యోదయ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 9 : సూర్యోదయ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్యుల సమావేశం స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం పూల నాగయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించగా.. అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొరిగాడి మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బందెల సుభాశ్, అంగడి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా షరాబు సంతోష్, సహాయ కార్యదర్శిగా న్యాతగాని మల్లికార్జున్, కోశాధికారిగా బోడపట్ల శ్రీశైలం, గౌరవ సలహాదారులుగా మంగ నర్సింహులు, పుట్ట మల్లేశం గౌడ్, గిరిరాజు వెంకటయ్య, హరినాథ్, విజయ్ కుమార్, నర్సింహులు, జోసెఫ్, శ్రవణ్‌కుమార్, శ్రీకాంత్, వెంకటేశ్, ఎన్నికయ్యారు.

రాయిపల్లి ఆనకట్టకు 45ఏండ్లు

- ఆత్మకూరు(ఎం) మండలంలో బిక్కేరు వాగుపై నిర్మించిన ఆనకట్ట
- 2వేల ఎకరాల భూములకు ప్రయోజనం

రాయిపల్లి బిక్కేరు వాగుపై నిర్మించిన ఆనకట్ట

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 9 : 65ఏండ్ల క్రితం వానకాలం సీజన్‌లో బిక్కేరు వాగు ఉప్పొంగి ప్రవహించినప్పుడు నీటి నిల్వ కోసం ముందస్తుగా వంతుల వారీగా 5వందల మంది రైతులు వాగుకు అడ్డంగా ఇసుక బస్తాలు, రాళ్లు వేసేవారు. కానీ.. వరద ఉప్పొంగి వేసిన కట్ట కొట్టుకుపోయేది. అయినప్పటికీ రైతులు మళ్లీ మళ్లీ కట్ట వేసేవారు. అలా కొన్నేండ్ల తర్వాత శాశ్వత ఆనకట్ట నిర్మాణం కోసం అప్పటి నీటిపారుదల శాఖ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మేడి రామనర్సయ్య సూచనతో గ్రామంలోని పెద్దలు, రైతులు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 1976లో ఆనకట్ట నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. అంతేకాకుండా అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి ఈ సమస్యను నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావుకు వివరించారు. దాంతో ఆనకట్ట కోసం హైదరాబాద్‌లోని ట్యాంక్స్ రిసెర్చ్ వారితో సర్వే చేయించి 1977లో మంజూరు చేశారు. దానికి రాయిపల్లి ఆన్‌కట్ ఎక్రాస్ ఆన్ బిక్కేరు వాగు హెచ్ – రాయిపల్లి విలేజ్ – 2 ఫీడర్ చానల్ వీర్లచెరువుగా నామకరణం చేశారు. ఈ ఆనకట్ట పనులను 1978లో ప్రారంభించారు. రెండేండ్లపాటు 2500 మంది కూలీలు శ్రమించి 1980లో నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ ఆనకట్ట నిర్మాణం కోసం ఆ రోజుల్లో 3,33,333 రూపాయలు వెచ్చించారు. ఆనకట్ట నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. ఈ ఆనకట్ట వర్షాకాలంలో నిండి ప్రవహిస్తుంది. ఆనకట్టకు ఆరు ఇసుక తూములు, రెండు రెగ్యులేటర్ షెటర్లు నిర్మించారు. ఇసుక తూముల నుంచి ప్రవహించే నీరు బిక్కేరు వాగులో కలుస్తుండగా, రెగ్యులేటర్ షెటర్ల నుంచి ప్రవహించే నీరు కట్టు కాల్వ ద్వారా ఆత్మకూరు(ఎం)లోని వీర్లచెరువు, మొరిపిరాలలోని కొత్త చెరువులోకి వెళ్తుంది. వీర్లచెరువు పూర్తిగా నిండినప్పుడు బూతుకుంటతోపాటు ఇతర కుంటలు, చెరువుల్లోకి నీరు ప్రవహిస్తుంది. రాయిపల్లి ఆనకట్ట ద్వారా రాయిపల్లి, మొరిపిరాల, కొండాపురం, సిద్దాపురం, సర్వేపల్లి, తిమ్మాపురం, కామునిగూడెం, కొరటికల్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు సుమారు 2వేల ఎకరాలకు సాగు ప్రయోజనం కలుగుతుంది.

స్నేహితులతో సరదాగా గడిపాడు.. తండ్రి కోపానికి బలయ్యాడు

కట్ట భాను (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి9 : మద్యం మనిషిని మృగంగా మార్చింది. మత్తులో కని పెంచిన కొడుకుని చంపుకునేలా చేసింది. ఆ తండ్రి చేసిన తప్పు జీవితంలో సరిదిద్దుకోలేని విధంగా మిగిల్చింది. తాను చదువుతున్న పాఠశాలలో శనివారం ఉదయం అవార్డు ఫంక్షన్ నిర్వహిస్తుండటంతో స్నేహితులతో కలిసి వెళ్లి సరదాగా గడిపి ఇంటికి కాస్త లేటుగా వచ్చిన చిన్నారి కట్ట భానుపై తాగిన మత్తులో ఉన్న తండ్రి ఉగ్రరూపం దాల్చాడు. ఇష్టం వచ్చినట్లుగా కొట్టాడు. పసి ప్రాయం కావడంతో ఆ దెబ్బలకు తట్టుకోలేక విగతజీవిగా మిగిలాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన కట్టా సైదులుకు ముగ్గురు మగ పిల్లలు. వారిలో భాను(14) చిన్నవాడు. చౌటుప్పల్ పట్టణంలోని అన్నామెమోరియల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో నిర్వహించిన అవార్డు ఫంక్షన్‌లో భాను స్నేహితులతో గడిపాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఫంక్షన్ అయ్యింది. ఆ తరువాత సాయంత్రం వరకు స్నేహితులతో గడిపి రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న తండ్రి సైదులు ఆలస్యం ఎందుకు అయ్యిందని నిలదీయంతోపాటు తీవ్రంగా కొట్టాడు. భాను చాతిలో బలంగా తాకడంతో అక్కడికక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే భాను మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో గ్రామానికి తీసుకొచ్చి ఖననం చేద్దామని ప్రయత్రించడంతో పోలీసులు అడ్డుకున్నారు. సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించారు. భాను తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కాంగ్రెస్‌ది అంతా దరఖాస్తుల పాలనే..

మాట్లాడుతున్న మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు రాంప్రసాద్

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 9 : పరిపాలన చేయడం చేతగాక, చెప్పిన పథకాలు అమలు చేయలేక, ఆరు గ్యారెంటీలకు పంగనామాలు పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి 14 నెలలుగా దరఖాస్తుల స్వీకరణతో కాలం గడుపుతున్నారని మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బక్క రాంప్రసాద్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పథకానికీ పదేపదే దరఖాస్తులు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. తాజాగా రేషన్ కార్డుల కోసం మళ్లీ మీ సేవ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు సర్కార్ యత్నించడంతో ప్రజలు మండిపడుతున్నారని తెలిపారు. గతంలో స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ప్రమాణికంగా తీసుకొని అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచులు ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూమి లేని పేదలకు మూడెకరాలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య


వ్యవసాయ కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : మండలంలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి భూమి లేని పేదలకు మూడెకరాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పెంచికల్‌పహాడ్, కృష్ణాపురం గ్రామాల్లో ఆదివారం ఇంటింటికి వెళ్లి వ్యవసాయ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ భువనగిరి మండలంలో భూ పంపిణీ నిషేధం ఉండడం వల్ల 20 సంవత్సరాల నుంచి పేదలకు ప్రభుత్వం సెంటు భూమి కూడా ఇవ్వడం లేదన్నారు. అనేక గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సిలివేరు ఎల్లయ్య, గ్రామ నాయకులు, వ్యవసాయ కూలీలు యాదగిరి, ఎల్లయ్య, సతీశ్, మల్లమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, మౌనిక, ఆండాలు, మంగమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 9 : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ధనికులకు అనుకూలంగా, పేదలకు అన్యాయంగా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్, గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, రైతుసంఘం మండలాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ కోరారు. ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం, విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు అబ్బాస్ బీ మృతి

ఆత్మకూరు (ఎం), ఫిబ్రవరి 9 : మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు అబ్బాస్ బీ (106) ఆదివారం మృతిచెందారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న ఆమె.. కష్టజీవుల హక్కుల కోసం కడవరకు కమ్యూనిస్టుగా నిలిచారు. అబ్బాస్ బీ మృతికి సీపీఐ నాయకులు, గ్రామ ప్రజలు జోహార్లు అర్పించి సంతాపం తెలిపారు.

మృతదేహం వెలికితీత

ఐదు రోజులు కొనసాగిన గాలింపు చర్యలు

బీబీనగర్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా.. ఐదు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మృతదేహం లభ్యమైంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఫీర్జాదిగూడకు చెందిన షాబాద్ చంద్రయ్య డయాలసిస్‌తో బాధపడుతున్నాడు. గత బుధవారం చికిత్స నిమిత్తం బీబీనగర్ ఎయిమ్స్‌కు వచ్చిన ఆయన బీబీనగర్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 9 : పట్టణంలో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని పద్మానగర్ సమీపంలో పోచంపల్లికి చెందిన జట్ల రాము పద్మానగర్‌కు బైక్‌పై వస్తుండగా పద్మానగర్‌కు చెందిన జెల్ల దేవేందర్ బైక్‌పై రోడ్ క్రాస్ చేస్తూ రాము బండిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రాము పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

చౌటుప్పల్, ఫిబ్రవరి 9 : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో బెల్టు దుకాణంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వచేసిన రూ.5వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడు పిట్టల నర్సింహపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పట్టణంలో పోలీసుల తనిఖీలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 9 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి పట్టణంలో ఆదివారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని వినాయక చౌరస్తా, జగదేవ్‌పూర్, హైదరాబాద్ రస్తాలలో తనిఖీలు నిర్వహించారు. ఆర్‌సీలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, ఇతర ఉల్లంఘనలపై ప్రధానంగా దృష్టి సారించారు. అనుమానితులపై నిఘా పెట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో సరైన నెంబర్ ప్లేట్, సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న ఒక కారు, మూడు ఆటోలు, 32 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఏసీపీ కె.రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో పట్టణ ఇన్‌స్పెక్టర్ కందుకూరి సురేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పుట్ పెట్రోలింగ్

భువనగిరి పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలైన హనుమాన్‌వాడ, సంజీవ్‌నగర్, పహాడీనగర్‌లో పుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రజలకు పోలీసుల సేవలు మరింత చేరువ కావాలన్న ఆలోచనతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

తుంగతుర్తిలో ఎవరి ఆగడాలు చెల్లవ్.. ఖబడ్దార్

- ఇందిరమ్మ ఇల్లు నేను సంతకం పెడితేనే వస్తది
- విలేకరుల సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, ఫిబ్రవరి 9 : 'తుంగతుర్తిలో ఎవరి ఆగడాలు చెల్లవ్. ప్రభుత్వమిచ్చే ఇందిరమ్మ ఇల్లు అయినా.. పార్టీ బీ–ఫామ్ ఏది కావాలన్నా.. నేను సంతకం చేస్తేనే వస్తది. ఏ ఎల్లయ్యతో కాదు.. గీసిన గీత దాటితే ఖబడ్దార్' అంటూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆయన వ్యతిరేక వర్గాలను హెచ్చరించారు. నియోజకవర్గంలోని ఆయన అసమ్మతివాదులంతా ఏకమై ఈ నెల 3న మోత్కూరులో తిరుగుబాటు సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సామేల్ ఆదివారం మోత్కూరు ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇలా స్పందించారు. తాను తెలంగాణ ఏర్పాటు కోసం కొట్లాడిన వ్యక్తినని, నియోజకవర్గ ప్రజల ఆదరణను గుర్తించి కాంగ్రెస్ సర్వే చేసుకొని పార్టీ టిక్కెట్ ఇస్తే ఎమ్మెల్యేగా గెలిచానని అన్నారు. రాజకీయాల్లో అనేక అటుపోట్లు ఉంటాయని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తాను బాల్యం నుంచీ ఇక్కడే చదువుకోవడం వల్ల ఈ ప్రాంత సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన ఉందని చెప్పారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వానికి చెందిన అర గుంట జాగా కూడా కబ్జాకు గురికానివ్వనన్నారు. కొందరు కబ్జాదారులకు తాను సహకరించకపోవడం వల్లే తనపై శత్రుత్వం పెంచుకున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే బునాదిగాని కాల్వ అసంపూర్తి పనులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి పనులు పునరుద్ధరిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, పోచం జగన్, బాలెంల విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జి.రామచంద్రుగౌడ్, అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాల అధ్యక్షులు లింగయ్య, నరేశ్, నాయకులు అవిలిమల్లు, జయశ్రీ, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

RACHAKONDA POLICE COMMISSIONERATE
ATHMAKUR (M) POLIC